బ్యాంకుల్లో పైసల్లేవ్

నానాటికీ తగ్గుతున్న డిపాజిట్లు

మారిన సగటు మదుపరి పొదుపు • ఫండ్లవైపే భారతీయుల చూపు

రూ.0.95 లక్షల కోట్లకు పతనం

దేశీయ బ్యాంకుల్లో నగదు లభ్యత గరిష్ఠంగా రూ.2.86 లక్షల కోట్ల నుంచి రూ.0.95 లక్షల కోట్ల కనిష్ఠానికి దిగజారినట్టు యూనియన్ బ్యాంక్ రిసెర్చ్ రిపోర్టు చెప్తున్నది. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో బ్యాంకులకు దిశా-నిర్దేశం చేసినప్పటికీ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు కనిపించకపోవడం గమనార్హం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. పదేపదే బ్యాంకుల్లో తరిగిపోతున్న ద్రవ్యలభ్యతపై హెచ్చరికలు చేశారు. చివరకు ఆర్బీఐ కూడా డిపాజిట్ల వృద్ధిపై బ్యాంకులు దృష్టి పెట్టాలని, లేకపోతే సమస్యలు తప్పవని హెచ్చరించింది. ఈ ఏడాది ఆగస్టు 2న బ్యాంకుల్లో రూ.2.56 లక్షల కోట్లుగా ఉన్న ద్రవ్య లభ్యత.. 16న రూ.1.55 లక్షల కోట్లకు పడిపోయింది. 28న ఇది రూ.0.95 లక్షల కోట్లకు దిగజారింది.

ఇదీ సంగతి..

బ్యాంకుల్లో ఎఫ్‌డీ అంటే సురక్షితమైన పెట్టుబడి. గృహస్తులు, సీనియర్ సిటిజన్లు, ఇన్వెస్టర్ల ఆసక్తి ఎఫ్‌డీలపైనే. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. రిస్క్ ఉన్నప్పటికీ అధిక రాబడులనిచ్చే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడుల పైనే దేశీయ మదుపరుల చూపు పడుతున్నది. మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్‌లోకి గృహస్తులు తమ సేవింగ్స్‌ను పెద్ద ఎత్తున తరలిస్తున్నారని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా చెప్పారు. ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. వీటితో పోల్చితే స్టాక్ మార్కెట్ ఆధారిత మ్యూచువల్ ఫండ్ పెట్టుబడుల్లో 2-3 రెట్లు రాబడులు ఎక్కువగా వస్తుండటంతో అంతా ఆవైపే వెళ్తున్నారు. కానీ మార్కెట్లు నష్టపోతే ఇన్వెస్టర్లకూ నష్టాలు తప్పడం లేదు. అయినప్పటికీ ఓవరాల్‌గా లాభాలే కనిపిస్తుండటంతో అంతా ఎఫ్‌డీలకు బదులుగా మ్యూచువల్ ఫండ్లకే ప్రాధాన్యతనిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

కఠిన చర్యలున్నా..

హై రిస్క్‌తో కూడిన పెట్టుబడుల వైపే దేశంలోని రిటైల్ ఇన్వెస్టర్లు అడుగులు వేస్తుండటంతో మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ.. ఈ పోకడకు బ్రేకులు వేసేందుకు కఠిన చర్యల్నే చేపడుతున్నది. ముఖ్యంగా ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌లో పెట్టుబడులపట్ల నిబంధనల్ని కఠినతరం చేసింది. అయితే డిపాజిట్లను ఆకర్షించేందుకు బ్యాంకులు కూడా వడ్డీరేట్లను పెంచాలన్న అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ అదే జరిగితే రుణాలపై వడ్డీరేట్లనూ పెంచాల్సి వస్తుందని బ్యాంకర్లు బదులిస్తున్నారు.

ఆవిష్కరణలకు ఏఐ ఉత్ప్రేరకం

రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

మార్కెట్‌లోకి బీసీఎస్ నూతన ఉత్పత్తులు



హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా నడుస్తున్న బ్లూ క్లౌడ్ సాఫ్ట్ టెక్ (బీసీఎస్).. సోమవారం నాలుగు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇందులో బ్లూహెల్త్ యాప్, బ్లూరా, ఎడ్యు జెనీ, బయోస్టర్ ఉన్నాయి. ఈ వినూత్న ఉత్పత్తులను హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతీ రంగంలోనూ కొత్త ఆవిష్కరణలకు ఉత్ప్రేరకంగా ఏఐ నిలుస్తున్నదని, ఆరోగ్య సంరక్షణలో ఏఐ అంటే జీవితాలను మార్చగలిగిన శక్తి అన్నారు. ప్రభుత్వ మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అజయ్ మిశ్రా, బీసీఎస్ చైర్‌పర్సన్ జానకి యార్లగడ్డలు పాల్గొన్నారు.

తెలంగాణకు ఎస్‌జీ గ్రూప్!

సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న ఎస్‌జీ గ్రూప్, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీలు

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఈవీల తయారీ కేంద్రం ఏర్పాటుకు ఎస్‌జీ గ్రూప్ ఆసక్తి చూపుతోందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. సోమవారం ఎస్‌జీ గ్రూప్ ఎండీ యోగేష్ భాటియా, పీఎస్ఆర్ గ్రూప్ ఎండీ శ్రీరంగారావులు సచివాలయంలో మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రూ.3వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు యోగేష్ భాటియా ముందుకొచ్చారని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. తద్వారా 1,000 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అంతకుముందు రాష్ట్రంలో ఈవీల ఉత్పత్తికున్న అనుకూలతల్ని మంత్రి భాటియాకు వివరించారు. పెట్టుబడులు పెడితే అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై భాటియా సానుకూలంగా స్పందించారు.

ఏఐపీఎంఏ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 7: ఆల్ ఇండియా ప్లాస్టిక్ మాన్యుఫ్యాక్చరర్ అసోసియేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అనిల్ రెడ్డి వెన్నం నియమితులయ్యారు. ఆయన ఈ పదవిలో ఏడాదిపాటు కొనసాగనున్నారు. రూ.3.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న ప్లాస్టిక్ పరిశ్రమలో తొలిసారిగా తెలుగువారికి ఉన్నత పదవి వరించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఏఐపీఎంఏకి 175 నగరాల్లో 22 వేలకు పైగా సభ్యులు ఉన్నారని, వీరిలో 90 శాతం మంది ఎంఎస్ఎంఈ రంగానికి చెందినవారేనని ఈ సందర్భంగా అనిల్ రెడ్డి తెలిపారు.

ఏఏఏఐ డైరెక్టర్‌గా మళ్లీ కే శ్రీనివాస్

హైదరాబాద్, అక్టోబర్ 7: అడ్వర్టైజింగ్ ఏజెన్సీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఏఏఐ) డైరెక్టర్‌గా తిరిగి స్లోకా అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కే శ్రీనివాస్ నియమితులయ్యారు. ప్రకటనలు, మార్కెటింగ్ రంగంలో శ్రీనివాస్‌కు మూడు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్నది. శ్రీనివాస్ మాట్లాడుతూ..ఈ ప్రతిష్ఠాత్మక సంఘం బోర్డు డైరెక్టర్‌గా మళ్లీ ఎంపికకావడం చాలా సంతోషంగా ఉన్నదని, ఇదో గొప్ప అవకాశం, బాధ్యత అన్నారు.

9 లక్షల కోట్లు ఆవిరి

వరుస నష్టాల్లో మదుపరులకు పెద్ద దెబ్బ

ఆరు సెషన్లలో 5,100 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్

ముంబై, అక్టోబర్ 7: వరుసగా ఆరో రోజూ కూడా దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. బ్లూచిప్ సంస్థల షేర్లలో అమ్మకాలు పోటెత్తడం, అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు తరలించుకుపోవడం సూచీల పతనానికి ఆజ్యంపోశాయి. ఒక దశలో వెయ్యి పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ ఇంట్రాడేలో 81 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. చివరకు 638.45 పాయింట్లు నష్టపోయి 81,050 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ కూడా 218.85 పాయింట్లు కోల్పోయి 25 వేల కీలక మైలురాయిని కోల్పోయింది. చివరకు 24,795.75 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద లక్షల కోట్ల స్థాయిలో కరిగిపోయింది. వరుసగా ఆరు సెషన్లలో సెన్సెక్స్ 4,521.85 పాయింట్లు లేదా 5.28 శాతం నష్టపోవడంతో మదుపరులు ఏకంగా రూ.9 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీ మార్కెట్ విలువ రూ.8,90,153.84 కోట్లు కరిగిపోయి రూ.4,51,99,444.70 కోట్ల(5.38 ట్రిలియన్ డాలర్లు) వద్దకు పడిపోయింది. అంతకుముందు రూ.4,60,89,598.54 కోట్లు (రూ.5.49 ట్రిలియన్ డాలర్లు) గా ఉన్నది.

- అదానీపోర్ట్స్ 4.17 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా యుటిలిటీ రంగ షేర్లు అత్యధికంగా 3.63 శాతం నష్టపోగా, పవర్ 3.14 శాతం, సర్వీసులు 3.12 శాతం, కమోడిటీస్ 2.54 శాతం, టెలికం 2.49 శాతం, ఎనర్జీ 2.46 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.38 శాతం చొప్పున నష్టపోయాయి.
- కానీ, ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లు కదంతొక్కడంతో సూచీల భారీ నష్టాలు తగ్గించుకోగలిగింది.
- సర్వీసు క్వాలిటీ విషయంలో అభ్యంతరాలు వ్యక్తంకావడంతో ఓలా షేరు 8 శాతం నష్టపోయి రూ.90.82 వద్ద నిలిచింది.
- అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, రిలయన్స్, కొటక్ బ్యాంక్, నెస్లె, ఎల్‌అండ్‌టీ, మారుతి, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, టాటా మోటర్స్ షేర్లు కూడా పతనం చెందాయి.
- మహీంద్రా అండ్ మహీంద్రా 1.46 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్‌ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేర్లు లాభాల్లో ముగిశాయి.

బంగారం మరింత పైకి

బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లకు తోడు ప్రస్తుత పండుగ సీజన్‌లో ఆభరణాల కొనుగోళ్లు ఊపందుకోవడంతో దేశీయంగా ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో సోమవారం కూడా ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.250 అధికమై రూ.78,700 పలికింది. కానీ, వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. కిలో వెండి ధర రూ.200 దిగొచ్చి రూ.94,200 నుంచి రూ.94,200కి దిగినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,671.50 డాలర్ల వద్ద, వెండి 32.20 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్‌ను నియమించుకున్నది. ఈ సందర్భంగా సచిన్‌తో బీవోబీ ఎండీ, సీఈవో దేబదత్త చంద్

లాట్ మొబైల్స్‌లో దసరా-దీపావళి ఆఫర్లు

హైదరాబాద్, అక్టోబర్ 7: ప్రముఖ స్మార్ట్ ఫోన్ల రిటైల్ విక్రయ సంస్థ లాట్ మొబైల్స్ 12వ వార్షికోత్సవంతోపాటు దసరా, దీపావళి పండుగలను దృష్టిలో పెట్టుకొని వినూత్న ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాలను కొనుగోలు చేసినవారికి కనీ వినీ ఎరుగని విధంగా 9 ఆఫర్లను ప్రకటించినట్లు కంపెనీ డైరెక్టర్ ఎం అఖిల్ తెలిపారు. ఈ ఆఫర్లలో రూ.9,999 వరకు కొనుగోలు చేసే ప్రతిదానిపై ఖచ్చితమైన బహుమతితోపాటు స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్, ఏసీలపై 40 శాతం వరకు తగ్గింపు ఆఫర్‌తోపాటు 10 శాతం తక్షణ నగదు వాపస్, ఎలాంటి ముందస్తు చెల్లింపులు జరపకుండానే నో కాస్ట్ ఈఎంఐ స్కీం, ఎస్బీఐ క్రెడిట్ కార్డుపై 5 శాతం వరకు తక్షణ తగ్గింపు, బ్యాండెడ్ యాక్సెసిరీస్‌పై 80 శాతం వరకు తగ్గింపు, ఓప్పో ఫోన్లపై లక్కీ డ్రా ద్వారా రూ.10 లక్షల నగదు, ఎంఐ, రియల్‌మీ మొబైళ్లపై లక్కీ డ్రాలో కార్లు, బైక్స్, మరెన్నో బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పించింది.

డీఎస్సీ ర్యాంకర్ మనీషాకు సన్మానం

మనీషాను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెనుబల్లి, అక్టోబర్ 7: పెనుబల్లికు చెందిన వంగా స్వామి, నాగమణి దంపతుల కుమార్తె మనీషా డీఎస్సీలో 64వ ర్యాంకు సాధించి ఉద్యోగం సాధించింది. సోమవారం వీ.ఎం.బంజరలోని శ్రీరాజ సాయి మందిరంలో ఆమెను రాజసాయిమందిరం చైర్మన్ చెన్నారెడ్డి విజయనరసింహారెడ్డి, శరన్నవరాత్రి కమిటీ సభ్యులు సత్కరించారు. నాకుబండి ధనలక్ష్మి, శ్రీదేవి, రామ, జగదీశ్వర్, ఉబారాణి, హిందుమతి, శివస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో బదిలీల జాతర

ఖమ్మం సర్కిల్ పరిధిలో 179 మందికి స్థానచలనం

నేడు వెలువడనున్న అధికారిక ఉత్తర్వులు

మామిళ్లగూడెం, అక్టోబర్ 7: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ఖమ్మం సర్కిల్ పరిధిలో వివిధ స్థాయిలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బదిలీలు జరగనున్నాయి. సంస్థ పరిధిలో కొనసాగుతున్న బదిలీ ప్రక్రియలో భాగంగా ఖమ్మం జిల్లా పరిధిలో బదిలీలకు అవకాశం ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు.. అర్హతగల బదిలీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది వివరాలను సోమవారం వెల్లడించారు. ఖమ్మం సర్కిల్ పరిధిలో 179 మందికి బదిలీ చేసేందుకు అవకాశం ఉంది. వారిలో డివిజనల్ ఇంజినీర్ స్థాయిలో ఒకరికి, సినియర్ అకౌంట్స్ అధికారి స్థాయిలో ఒకరికి, సహాయ అకౌంట్స్ అధికారి స్థాయిలో ముగ్గురికి మాత్రం వరంగల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి బదిలీ ఉత్తర్వులు రానున్నాయి. మిలిగిలి 174 మందికి మాత్రం ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ అధికారులు వెల్లడించిన అధికారిక లెక్కల ప్రకారం.. సహాయ డివిజన్ ఇంజినీర్లు (ఏడీఈ)లు-10, ఏఏఈ/ ఏఈఈలు-42, సబ్ ఇంజినీర్లు-28, జేఏవోలు-21, సీనియర్ అసిస్టెంట్లు-22, జూనియర్ అసిస్టెంట్లు-8, రికార్డు అసిస్టెంట్లు-ముగ్గురు, కార్యాలయ సహాయకులు-11, ఫోర్‌మెన్లు-8, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లు-16, ఎస్‌జీఎస్‌వోలు-ముగ్గురు, వాచ్‌మెన్లు- ఇద్దరు చొప్పున బదిలీలు జరగనున్నాయి. ఈ బదిలీల ఉత్తర్వులను మంగళవారం అధికారికంగా విడుదల చేసేందుకు ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ సురేందర్, డీఈటీ సీహెచ్ బాబూరావు ఆధ్వర్యంలో కసరత్తు కొనసాగుతోంది.

టాలెంట్ స్కూల్ పూర్వ విద్యార్థులకు మెడికల్ సీట్లు

సత్తుపల్లి, అక్టోబర్ 7: సత్తుపల్లి టాలెంట్ స్కూల్ పూర్వ విద్యార్థులు గుర్రాల చంద్రికలక్ష్మి, తాటి దేవేందర్ మెడికల్ సీట్లు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు తెలిపారు. కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గుర్రాల చంద్రికలక్ష్మీ రాష్ట్రస్థాయి 1815 ర్యాంకు సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాల నల్గొండలో, తాటి దేవేందర్ రాష్ట్రస్థాయిలో 539వ ర్యాంకు సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాల భూపాలపల్లిలో సీటు సాధించారు. విద్యార్థులను టాలెంట్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

పొదల్లోకి దూసుకెళ్లిన బాలేరో వాహనం

పొలాల్లోకి దూసుకెళ్లిన వాహనం

సత్తుపల్లి, అక్టోబర్ 7: ఆగి ఉన్న లారీని స్వల్పంగా ఢీకొట్టిన బోలేరో వాహనం పొదల్లోకి దూసుకెళ్లిన ఘటన సోమవారం తెల్లవారుజామున తల్లాడ ఎన్టీఆర్‌కాలనీ వద్ద జరిగింది. విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ విజిలెన్స్ ఆఫీసర్లు తనిఖీల్లో భాగంగా తల్లాడ రింగ్ సెంటర్‌లో వాహనాల తనిఖీ చేశారు. అనంతరం బోలేరో వాహనంలో విజయవాడ వెళ్తుండగా ఎన్టీఆర్‌కాలనీ వద్ద ఎదురుగా ఆగి ఉన్న లారీని స్వల్పంగా ఢీకొట్టి అదుపు తప్పి పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. తెల్లవారుజామున ట్రాక్టర్ల సహాయంతో వాహనాన్ని బయటకు తీశారు. తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డామని విజిలెన్స్ అధికారులు బీ.వెంకటేశ్వర్లు, పీ.శ్రీనివాసరావు తెలిపారు.

బంతి సాగు.. లాభాలు బాగు

కూసుమంచి మండలంలో బంతి పూల తోటలు

బతుకమ్మలకు జోరుగా పూల అమ్మకాలు

పూల పండుగతో రైతులకు ఆదాయం

కూసుమంచి, అక్టోబర్ 7: బంతి సాగు రైతులకు కాసులు కురిస్తున్నది. నాడు కనీసం వర్షాధార పంటలకు నోచుకోని పంట చేలు.. నేడు పూల వర్షం కురిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా పలువురు రైతులు బంతి పూల సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. ప్రతి సంవత్సరం దసరా నుంచి బంతిపూలకు డిమాండ్ ఉండడంతో రైతులకు ఆదాయం వస్తుంది. మండలంలో ప్రస్తుతం బంతి తోటలు కళకళలాడుతున్నాయి. బతుకమ్మ పండుగ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు పూలకు డిమాండ్ ఉంటుందని, పూలకోసం రోజూ వస్తున్నారని రైతులు తెలుపుతున్నారు. ఈ సంవత్సరం బంతి పూల తోటలు ఎక్కువగా పూయడంతో బంతి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కొద్ది భూముల్లో బంతి తోటలు వేసుకొని వ్యాపారం చేస్తున్న అనేక మంది రైతులు ఈ సారి మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నారు.

బంతిసాగుతో మంచి లాభాలు

బంతి సాగుతో మంచి లాభాలు వస్తున్నాయి. గత సంవత్సరం బంతిపూలతో ఆదాయం సమకూరింది. ఈ సారి కూడా బంతి తోట వేశాను. మార్కెట్‌లో గిరాకీ బాగానే ఉంది. తోట దగ్గరే పూలు అమ్ముకుంటాం. బంతిపూల సీజన్‌తో రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మకాలు చేస్తున్నాం.

– జ్యోతి, ధర్మాతండా రైతు

సాగు నీటి కష్టాలు పోయాయి

గతంలో వ్యవసాయం చేసినప్పుడు సాగునీటి కోసం ఇబ్బంది పడేవాళ్లం. దసరా నుంచి మూడు నెలల పాటు బంతి పూలకు గిరాకీ ఉంటుంది. తమకు అప్పుడు వ్యాపారాలు నడుస్తాయి. నాకు ఉన్న భూమిలో రెండు రకాల బంతి తోట వేశాను. రోజు రోడ్డుపైన అమ్ముకుంటాం. కేజీ రూ.70 నుంచి రూ.100 వరకు అమ్ముకుంటాం.

– పద్మ, కేశ్వాపురం

శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలి

11న సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయాల ప్రారంభం

సంక్షేమ వసతి గృహాల నివేదికలు సమర్పించాలి: ఖమ్మం కలెక్టర్

అధికారులతో సమీక్షిస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, అక్టోబర్ 7: సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అలాగే, సంక్షేమ శాఖల వసతిగృహాల నివేదికలనూ సమర్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో ఉప ముఖ్యమంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా శాఖల అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ముందుస్తు సమీక్షలో ఆయన మాట్లాడారు. సంక్షేమ శాఖల అధికారులు పూర్తిస్థాయి నివేదికలను సిద్ధం చేయాలని, అన్ని సంక్షేమ శాఖలు ఒకే ఫార్మేట్‌లో నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. 'జిల్లాలో ఎన్ని వసతి గృహాలు ఉన్నాయి? వాటిలో సొంత భవనాలు ఎన్ని? అద్దె భవనాలు ఎన్ని? వాటిల్లో సమస్యలు ఏమిటి?' వంటి వివరాలను ఆ నివేదికలో పొందుపర్చాలని సూచించారు. ఈ నెల 9న డీఎస్సీ ఉద్యోగ నియామకపత్రాలను హైదరాబాద్‌లో సీఎం నుంచి అందుకోవడానికి జిల్లా నుంచి ఎంపికైన వారిని హైదరాబాద్ తీసుకెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా నుంచి ఎంపికైన వారు 500 మందికిపైగా ఉన్నందున అందుకు అనుగుణంగా బస్సుల ఏర్పాటు ఉండాలన్నారు. ఈ నెల 11న జిల్లాలో సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల సముదాయాల శంకుస్థాపన కార్యక్రమం ఉన్నందుకు అందుకు తగిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. దళిత బంధు యూనిట్ల గ్రౌండింగ్‌లో దారి మళ్లిన యూనిట్ల విషయమై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. దారిమళ్లిన యూనిట్ వివరాలు, లబ్ధిదారులు, యూనిట్ ఇప్పుడు ఉన్న వారి వివరాలు తీసుకున్న చర్యలపై నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల డీడీలు కస్తాల సత్యనారాయణ, విజయలక్ష్మి, డీఈవో సోమశేఖరశర్మ, సీపీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేయాలి'

ఖమ్మం లీగల్, అక్టోబర్ 7: అక్కినేని కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కమ్మ మహాజన సంఘం మాజీ డైరెక్టర్ గొల్లపూడి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గవర్నర్‌కు, సీఎం రేవంత్‌రెడ్డికి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్‌గాంధీకి సోమవారం లేఖలు రాశారు. అబద్ధపు వ్యాఖ్యలు చేసి క్షమాపణలు చెప్పిన మంత్రి సురేఖకు ఓ ఎమ్మెల్సీ, మరో మంత్రి బాసటగా నిలవడం సిగ్గుచేటని అన్నారు. కొండా సురేఖను వెంటనే మంత్రివర్గం నుంచి తప్పించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

'జయవిలాసిని' రాంబాబు జన్మదిన వేడుకలు

జయవిలాసిని అధినేత రాంబాబుకు జ్ఞాపిక అందజేస్తున్న డైరెక్టర్లు

రఘునాథపాలెం, అక్టోబర్ 7: జయవిలాసిని డెవలపర్స్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కుంచపు రాంబాబు జన్మదిన వేడుకలు ఖమ్మం నగరంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్‌చార్జి తంబూరి దయాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ హాజరయ్యారు. జయవిలాసినీ డెవలపర్స్‌ను స్థాపించి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న కుంచపు రాంబాబు కృషిని వారు అభినందించారు. అంతేగాక సంస్థ ద్వారా ఆయన చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గుర్తుచేశారు. జయవిలాసిని డైరెక్టర్ సునిల్‌కుమార్ జ్ఞాపికను అందజేశారు. నున్నా రమణ, సంస్థ డైరెక్టర్లు రామకృష్ణారెడ్డి, కొండయ్య యాదవ్, పగడాల అనంతరాములు, విజేందర్, షేక్ జానిమియా తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి కోటమైసమ్మ జాతర

ఆలయ అధికారులతో మాట్లాడుతున్న ఏసీపీ

కారేపల్లి, అక్టోబర్7: దసరా సందర్భంగా మండలంలోని ఉసిరికాయల పల్లిలోని కోటమైసమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 12నుంచి 5 రోజుల పాటు నిర్వహించే కోటమైసమ్మ తల్లి జాతర ఏర్పాట్లను ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పరిశీలించారు. జాతరకు కారేపల్లి, ఇల్లెందు, సీతారాంపురం మూడు మార్గాల ద్వారా భక్తులు జాతరకు వస్తుంటారు. ఈ సందర్భంగా వాహనాల రద్దీతో ప్రతి ఏటా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుండడంతో ఏసీపీ సిబ్బందితో సమ